రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సాహు మహిళలు

**తాండూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
చట్ట సభలో మహిళలలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. దశాబ్దాలకు పైగా డిమాండ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ఆమోదం తెలపడంపై మంగళవారం తాండూరులో మహిళామోర్చా ఆద్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీలత ఆద్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిచడం చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బంటారం లావణ్య, మహిళా మోర్చ పట్టణ అధ్యక్షురాలు ఉమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక, కన్వీనర్ అర్చన, కోకన్వీనర్ సంగీత తదిరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి సీపీ ఏర్పాట్ల పరిశీలన

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని లక్ష్మినారాయణచెరువు (మినిట్యాంక్‌బండ్) వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను రాచకొండ కమీషనర్ డిఎస్.చౌహాన్ పరిశీలించారు. బుధవారం నుంచి చెరువులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయనుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన అవసరమైన ఏర్పాట్లపై



ఎదులాబాద్ చెరువు కట్టపై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

సమీక్షించారు. చెరువు కట్టపై క్రరేలతో ఏర్పాటు చేసిన బారికేడ్లు, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నిమజ్జనానికి క్రేన్లు, బారికేడ్లు, విద్యుత్ శాఖ నుంచి లైటింగ్, ఎదులాబాద్ పంచాయతీ ద్వారా పారిశుద్య పనులు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈసందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ రాచకొండ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నానమి తెలిపారు. నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద క్రేన్లు, బారికేడ్లు, మంచినీటి వసతి, గత ఈతగాళ్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండా గత సంవత్సరం కంటే ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జనానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని, ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. గత సంవత్సరాల్లో నిమజ్జనం జరిగిన క్రమాన్ని, పాటించిన విధానాన్ని సమీక్షించారు. విగ్రహాల నిమజ్జనం కేవలం పోలీసులు, మున్సిపల్, గ్రామపం చాయతీ సిబ్బంది, నియమిత వాలీంటర్లు మాత్రమే చేయాలని, భక్తులను చెరువులో విగ్రహాలు వేయడానికి అనుమతికూడదని ఆయన స్పష్టం చేశారు. సీపీ వెంట డీసీపీ గిరిధర్, మల్కాజ్‌గిరి ఏసీపీ నరేశ్‌రెడ్డి, ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ చైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి, కమీషనర్ పి.వేమనరెడ్డి, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, సహకార సంఘం డైరక్టర్ చందుపట్ల ధార్మరెడ్డి, గ్రామకార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ ఎంపి టిసి కందుల కుమార్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడు జిల్లాలో మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సిపిఐ ధర్నాలు

### -జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 19, ప్రభాతవార్త :**
మేడ్చల్ జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల వద్ద, మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుల కోసం, ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ కోసం జిల్లా వ్యాప్తంగ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం (20) ధర్నాలు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం, ఇళ్ళస్థలాల పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. తహసీల్దార్ కార్యాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో ధరఖాస్తులు చేసుకున్న వారు అందరు పాల్గొనాలని ఈ విషయంపై తహసీల్దార్లకు, మున్సిపల్ కమిషనర్లకు ధర్నాల తరువాత వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. భూ సమస్యల విషయంపై ధరణితో ఇబ్బందులు పడుతున్న వారు కూడ ధర్నాలో పాల్గొనాలని జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ కోరారు.

# ఘనంగా వినాయక పూజలు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలో వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో విఘ్నేశ్వరస్వామిని అర్చకుల మంత్రోచ్చారణాల మద్య ప్రతిష్టించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో యువజన, కాలనీ, కుల సంఘాల ఆధ్వర్యంలో గణనాధున్ని ప్రతిష్టించి పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో విఘ్నేశ్వరస్వామికి పూలు, పండ్లు, పూజా పత్రి, నైవేధ్యం సమర్పించి పూజలు చేశారు. ఘట్‌కేసర్, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్, ఘణాపూర్, మర్రిపల్లిగూడ, వెంకటాపూర్, చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, మక్తా, ఫకీర్‌టెక్యా తదితర కాలనీల్లో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఆవరణలో ఆర్‌కే శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణేశునికి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎం .సుధీర్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అర్చకులు రాధాకృష్ణశర్మ ఆశీర్వచణాలు అందించగా నిర్వహకులు మంత్రితో పాటు ప్రజాప్రతినిధులు, నేతలను సన్మానించారు. ప్రతి యేటా వినాయకచవితికి మంత్రి మల్లారెడ్డి ఇక్కడికి వచ్చి విఘ్నేశ్వరునికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం ఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాధునికి మంత్రి పూజ చేయగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ ఎంపీపీలు బండారి దాసుగౌడ్, బండారి శ్రీనివాసు



ఘట్‌కేసర్ మున్సిపల్ వద్ద ఆర్‌కే శివాజీ యూత్ గణేశుని పూజలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఒరుగంటి వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బండారి అంజనేయులుగౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, బండారి వసంత శ్రీనివాస్‌గౌడ్, బత్తుల నరేశ్‌గౌడ్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, కోఆప్షన్ సభ్యురాలు పల్లె అరుణ, మాజీ ఎంపిటిసిలు చిల్కూరి గోపాల్‌రెడ్డి, గడ్డం మహేశ్, కొత్త చందర్‌గౌడ , కందుల కుమార్, సహకార సంఘం మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, కీసరగుట్ట డైరక్టర్ ఎంపాల సుధాకర్‌రెడ్డి, మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, మండల టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, నాయకులు బీగూడెం శ్రీనివాస్‌గౌడ్, అబ్బగోని రఘునందన్‌గౌడ్, బండారి జగదీశ్వర్, బర్ల హరిశంకర్, పల్లె విజయ్‌గౌడ్, బొక్క విష్ణువర్దన్ రెడ్డి, పోత్కని మల్లికార్జున్‌రాజు, కందకట్ల మాధవరెడ్డి రొడ్డ యాదగరి, క్రిష్టాచారీ, కృష్ణ, గణేశ్, సంజయ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### -సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్

**వికారాబాద్,సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్క యువత తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రముఖ సినీ నటుడు, వికారాబాద్ జిల్లా స్వీప్ ఐకాన్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీప్‌లో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, మన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని, అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల రోజు ప్రతి ఒక్కరూ తమ వాట్సాప్ స్టేటస్ ద్వారా ఓటు వినియోగంపై మెసేజీలను పొందుపరచాలని సూచించారు. యువత వచ్చే ఎన్నికలలో క్రియాశీలక పాత్ర వహించాలని, ప్రజల ప్రయోజనాన్ని కోరుకునే నాయకున్ని ఎంచుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నతాధికారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మంచి వాతావరణంతో కూడుకున్న వికారాబాద్ ప్రాంతానికి మంచి భవిష్యత్తు ఉందని, తెలంగాణ లోనే బెస్ట్ సిటీగా వికారాబాద్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాబోవు ఎన్నికలలో ప్రతి ఒక్కరు ఓటింగ్ లో పాల్గొని దేశంలోనే వికారాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. ప్రజాస్వామ్యంలో అతి పెద్ద రాక్షసుడు డబ్బు, మద్యం అని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికలలో నిర్భయంగా పాల్గొని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరు ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారందరూ చివరి రోజైన ఈ రోజే ఓటరుగా నమోదై మన గ్రామం, మన ప్రాంత అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటింగ్ లో పాల్గొనాలని ఆయన అన్నారు. జిల్లాలో గత ఎన్నికలలో 76 శాంతం ఓటింగ్ పోలింగ్ జరిగిందని, వచ్చే ఎన్నికలలో 90 శాంతం పోలింగ్ జరగాలని ఆయన ఆకాంక్షించారు. వచ్చే మూడు నెలల్లో ఎన్నికలు ఉన్నందున ప్రతి ఒక్కరు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి వికారాబాద్ అతి చేరువలో ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, రాబోయే రోజుల్లో అభివృద్ధి పరిచే మంచి నాయకుడిని జిల్లా ప్రజలు వారి ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు.సినీ హీరో బెల్లకొండ సాయి శ్రీనివాస్‌ను చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారని, అదే తీరుగా ప్రతి విద్యార్థి ఒక్కో రంగంలో రాణిస్తే వారిని చూసి కూడా మిగతా వారు కేరింతలు కొడతారని అన్నారు. ప్రతి విద్యార్థి రియల్ లైఫ్‌లో హీరోలు కావాలని, ఆ దిశగా ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా విద్య నభ్యసించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దాని విలువ తెలుసుకుని ప్రతి ఒక్కరు ఎన్నికల్లో ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాసరావు, స్వీప్ నోడల్ అధికారి కోటాజి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కలెక్టర్ నారాయణరెడ్డి



పాల్గొన్న విద్యార్థులు

## ప్రభుత్వంపై విశ్వాసంతోనే బీఆర్ఎస్‌లోకి చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుంటున్న ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు, సెప్టెంబర్19, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుస్థిర, ప్రజారంజక పాలనకు ఆకర్షితులై ప్రజలు బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్య మంత్రి కేసీఆర్ అనతికాలంలోనే ఎంతగానో రాష్ట్రాభివృద్ధిని సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికీ రోల్ మాడల్‌గా తీర్చిదిద్దారని ఆయన కొనియాడారు. ఆమనగల్లు పట్టణంలోని పలు కాలనీలకు చెందిన పలువురు మహిళలు, పురుషులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు నేనవత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో నారాయణసాగర్ ఫంక్షన్ హాలులో జరిగిన చేరికల కార్యక్రమానికి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జడ్పీటీసీ అనురాధపత్యా నాయక్, వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ నిట్టనారాయణల సమక్షంలో కొత్తవారిని పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బీజేపీని ఎండగట్టారు. ఆమనగల్లు అభివృద్ధి వెనుకబాటుతనానికి స్థానిక బీజేపీయే కారణమని విమర్శించారు. అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తేవడంలో బీజేపీ నేత ఆచారి విఫలం అయ్యారన్నారు. వెనుకబడిపోతున్న ఆమనగల్లుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యేగా నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. కళాశాల భవన నిర్మాణం కొరకు నిధులు, 4.5కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు, ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల స్థాయి పెంపుతోపాటు భవన నిర్మాణం కొరకు రూ. 17.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి ఎప్పటికప్పుడూ తీసుకుపోగా ఆయన వెంట వెంటనే వాటి పరిష్కారానికి తోడ్పాటునందిస్తున్నాడన్నారు. వచ్చే ఎన్నికలలో మళ్ళి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, చుక్క నిరంజన్‌గౌడ్, టీ. రామకృష్ణ, దేరంగుల వెంకటేశ్, గణేశ్, పూసలి సత్యం, పూసలి భాస్కర్, గుత్తి బాలస్వామి, వస్పుల రంజిత్, పురుషోత్తం, కొమ్ము ప్రసాద్, ముక్కెరి కృష్ణయ్య తదితరులు ఉన్నారు

## నందివనపర్తిలో ప్రకృతిని కొల్లగొడుతున్న గ్రానైట్ వ్యాపారులు



గుట్టలను తవ్వుతున్న దృశ్యం

**యాచారం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త**
మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వెలసిన వెంచర్ల వలన ఎన్నో ప్రకృతి రకాల సంపద వినాశనానికి గురైనా పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో మునిగి వాటిని పరిరక్షించడంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సంపదంతా కరుమరుగైపోవడానికి ప్రధానంగా అధికారుల నిర్లక్ష్యమే కారణమని అంటున్నారు. గతంలో ఒక చెట్టు నరకాలంటే ఎంతో ఆలోచించి పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని అవసరం అయితేనే నరికేవారని, పరిస్థితి అలా ఉండేదని నేడు చెట్లను నరికేస్తున్నారని స్థానికులు, పర్యావరణ పరిరక్షణ సేవకులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రకృతిలో సమతుల్యత తగ్గి వ్యత్యాసం ఏర్పడడం వలన వర్షాలు సకాలంలో పడక తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందంటున్నారు. అందుకు పర్యావరణాన్ని పరిరక్షించే భాద్యత అందరిపై ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండల పరిధిలోని చిన్నతుండ్ల నుండి చౌదరిపల్లి వరకు ఉన్న గుట్టలను క్రషర్ వ్యాపారులు వారి ఆర్థిక లబ్ది కోసం గుట్టలను పిండి డబ్బులుగా భావిస్తూ సంపాదిస్తున్నారని ఆరోపించారు. తమ స్వార్థం కోసం పర్యావరణాన్ని పూర్తిగా నశింపజేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తమకు పట్టదన్నట్లుగా వ్యవహరించడం చాలా భాదాకరమంటున్నారు. భాద్యతగా ఉంటూ యాచారం మండలంలోని పర్యావరణాన్ని రక్షించడం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఉన్న అటవిని, కొండలు, గుట్టలను కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని లేని పక్షంలో ఈ ప్రాంతంలో తీవ్ర పర్యావరణ అసమానతలకు గురవడంతో పాటు తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటుందని భావిస్తున్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు బాధ్యతగా వ్యవరించాలి

### -రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి,జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు వాకాటి అరుణ
### -పాల్గొన్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్
### -కలెక్టరేట్‌లో అధికారులతో,రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమీక్షా సమావేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 19, ప్రభాతవార్త**
ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు బాధ్యతాయుతంగ వ్యవరించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, మేడ్చల్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు వాకాటి అరుణ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, డిఆర్ఓ హరిప్రియ,జిల్లాలోని ఈఆర్ఓలు, ఎఇఆర్ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఓటరు జాబితాపై సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగ పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు వాకాటి అరుణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండ పూర్తి పారదర్శకంగ ఉండేలా ఓటరు జాబితాను రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవంఐ, జిల్లా వ్యాప్తంగ ఐదు నియోజకవర్గాల నుంచి వచ్చిన ధరఖాస్తులు, అందులో ఉన్న ఆక్షేపణలపై తీసుకున్న నిర్ణయాలపై జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం చొప్పున ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలను సమీక్షించటం జరిగిందన్నారు. 2023లో 18సంవత్సరాలు నిండిన అందరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేసే విధంగ అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమింపబడిన ఏజెంట్ల సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు,తొలగింపులు కొరకు అందిన ధరఖాస్తులను క్షుణ్ణంగ పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎన్నికల నిబంధనల మేరకు సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని, అభ్యంతరాలను ఎప్పటికపుడు పరిగణలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగ జిల్లా వ్యాప్తంగ ఐదు నియోజకవర్గాల నుంచి వచ్చిన మార్పులు, చేర్పులు,సవరణలు కోరుతూ ఓటర్ల నుంచి సేకరించిన నిర్ణీత నమూనా ఫారాలను రిజిష్టర్లలో వాటి నమోదు వివరాలను ఎప్పటికపుడు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగ బూత్ లేవల్ ఆఫీసర్‌లకు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలా అనుసరిస్తున్నారనే ప్రత్యేకంగ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మరింత విస్తృత ప్రచారం, ఇంటింటి సర్వే వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. దీంతో పాటు గ్రామాలు ప్రాంతాల నుంచి ఇతర చోట్లకు వలస వెళ్లిన వారి గురించి సంబంధిత పోలింగ్ కేంద్రం అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక శిభిరాలు, నేరుగా వచ్చినధరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత పూర్తి చేయాల్సిందిగ ఆమె సూచించారు. జిల్లా వ్యాప్తంగ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు పక్కాగ పాటించాలని ఈ విషయంలో పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన జరిగేలా కృషి జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడ ఓటరు జాబితా రూపకల్పనలో క్రియాశీలక పాత్రపోషిస్తూ పూర్తి సహకారం అందించాలని వాకాటి అరుణ సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎక్కడైన పొరపాట్లు,తప్పిదాలు ఉంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకరావాలని వెంటనే వాటిని సరిచేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. బోగస్ ఓటర్లకు ఆస్కారం లేకుండ పక్కాగ తుది జాబితా రూపొందేలా రాజకీయపార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని పరిశీలకురాలు వాకాటి అరుణ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చొరవ చూపాలన్నారు. 18సంవత్సరాలు నిండిన యువతీ,యువకులపై దృష్టి పెట్టి జాబితాలో ఉండేలా చూడాలని ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా ప్రక్రియ పూర్తి పాదరదర్శకంగ నిర్వహించటం జరిగిందన్నారు. ఈ విషయంలో రిటర్నింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్‌లేవల్ ఆఫీసర్లకు ఎప్పటికపుడు సూచనలు చేయటంతో పాటు క్షేత్రస్థాయిలో ఆకస్మికంగ తనిఖీలు చేసి పరిశీలించినట్లు తెలిపారు. అక్టోబరు 1వ తేదీన భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు పూర్తి వివరాలతో సమగ్రమైన తుది ఓటరు జాబితా రూపొందించి అక్టోబరు 4న తుది ఓటరు జాబితా ప్రచురించేందుకు అధికారులు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ హరిప్రియ, ఈఆర్ఓలు, ఎఇఆర్ఓలు, సంబంధిత అధికారులు, పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలకురాలు వాకాటి అరుణ,పాల్గొన్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ పలువురు అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు

## కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి

### - మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
### - ఇంటింటికి కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు



గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న నేతలు

**తాండూరు, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని మెడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ విజయభేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై కాంగ్రెస్ నేతలు తాండూరులో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ గ్యారెంటీ కార్డులను అందజేశారు. సోమవారం తాండూరు పట్టణంలోని వార్డులలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు రమేష్ మహారాజ్, పెద్దెముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, ఆయా వార్డు కౌన్సిలర్లతో కలిసి ఇంటింకి కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై వివరిస్తూ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన గ్యారెంటీ పథకాలు అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, తాండూరులో కాంగ్రెస్ ఎండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



డబిల్‌పూర్‌లో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి

**మేడ్చల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త ః**
ఆపదలో ఉన్న పేదలకు మెరుగైన వైద్య సహాయం కోసం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరంగా మారిందని మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్ యాదవ్‌కు సీఎం రిలీఫ్ పథకం ద్వారా మంజూరైన రూ. 21,500, శ్రీనాథ్‌కు మంజూరైన రూ.60 వేల చెక్కులను లబ్ధిదారులకు గ్రామంలో సర్పంచ్ గీతా భాగ్యరెడ్డితో కలిసి ఎంపిపి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పేదలను ఆదుకునేందుకు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని, అందులో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల పాలిట వరంగా మారిందన్నారు. అనారోగ్యానికి గురైన వారికి చికిత్సకు తగిన ఆర్థిక సహాయం కొరకు అందిస్తున్న ఈ పథకం ద్వారా ఎంతో మందికి లబ్ది చేకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాగ్యరెడ్డి, రామోదర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఆనంద్, గిరీష్, సురేష్, శ్రీనాథ్, ప్రేమ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపికైన మేడ్చల్ విద్యార్థిని**
**మేడ్చల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త ః** రాష్ట్ర స్థాయి సెమినార్‌కు మేడ్చల్ విద్యార్థిని ఎంపికైంది. ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో గోదావరి ఆడిటోరియంలో మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఆర్ ఏ డయిట్ ఫుడ్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌కు మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని యాస్మిన్ ఖాతున్ మేడ్చల్ జిల్లా నుండి పాల్గొన్నది. ఈ సెమినార్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఎంపికైంది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, గైడ్ టీచర్ కవిత, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

## విశ్వకర్మల అభ్యున్నతికి కృషి



బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

**షాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :**
విశ్వకర్మల అభ్యున్నతికి కృషి చేస్తానని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని మహంకాళీ దేవాలయంలో సొంత ఖర్చులతో నూతనంగా బోరు వేయించారు. అనంతరం బోరు మోటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విశ్వశాంతి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. విశ్వకర్మల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ శేఖర్‌రెడ్డి, నాయకులు జడల రాజేందర్‌గౌడ్, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, శ్రీరాంరెడ్డి, వెంకట్‌యాదవ్, కమ్మరి శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు మధుసూదన్‌చారి, సంఘం ప్రతినిధులు యాదగిరి, రమేష్, రజిని తదితరులు ఉన్నారు.

**పీఆర్టీయూ ఆధ్వర్యంలో హెచ్‌ఎం రాంరెడ్డికి సన్మానం**



బదిలీపై విచ్చేసిన హెచ్‌ఎం రాంరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

**కొడంగల్, సెప్టెంబర్ 19ప్రభాతవార్త**
ప్రభుత్వం ఉత్తర్వుల్లో మేరకు చేపట్టిన బదిలీల్లో భాగంగా కొడంగల్ జడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా విచ్చేసిన కె.రాంరెడ్డిని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. మంగళవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘం నాయకులు శరణ్‌కుమార్, అబ్దుల్‌హక్, ఆర్. అనంద్‌రావు, గోపినాథ్, సులేమాన్, వీరేషం, వెంకటయ్య తదతరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అలాగే ఇన్ని రోజు లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహించిన ప్రసన్నను పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులు సన్మానించారు.

**భక్తిశ్రద్ధలతో శ్రీవీరభద్రేశ్వర స్వామివారి జయంతి**



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**కొడంగల్, సెప్టెంబర్ 19ప్రభాతవార్త**
కొడంగల్ పట్టణంలోని శ్రీవీరభద్రేశ్వర స్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరం బపురి జగద్గురు 1008 శ్రీశ్రీవీర సోమేశ్వర శివాచార్య మహాస్వామి, రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సంఘం అదేశాల మేరకు జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అలయంలో శ్రీభద్రకాళి సమేత శ్రీవీరభద్రేశ్వర స్వామివారికి మడపతి జగదీష్ స్వామి, గడ్డం చంద్రశేఖర్‌స్వామి అద్వర్యంలో పంచామృతాభిషేకం, పుష్పార్చ న, అష్టోత్తర శతనామా వళి, దూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఖడ్గాలు వేస్తు స్వామివారిని వేడుకున్నారు. మంగళహారతులు అందిస్తు స్వామివారిని దర్శించుకున్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

**బ్లేడుతో గొంతు కోసుకొని యువకుడు ఆత్మహత్య**
**-పగిడ్యాల్ గ్రామంలో విషాదం..**

**యాలాల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
బ్లేడుతో గొంతు కోసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాలాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పగిడ్యాల్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అరవింద్ కథనం ప్రకారం..పగిడ్యాల గ్రామానికి చెందిన నెత్తి మల్లప్ప (28) అనే యువకుడు గత కొన్ని రోజులుగా మతి స్థిమితం సరిగ్గా లేదు. దీంతో మంగళవారం బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని బావిస్తున్నారు. కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసున మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెకు సంఘీబావం తెలిపిన కాంగ్రెస్ పార్టీ



దీక్షలో పాల్గొన్న దేవేందర్‌ముదిరాజ్



ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడి సిబ్బంది



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## సమస్యలు పట్టించుకోని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

**కందుకూర్ మండలంలో...**
**కందుకూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని జెడ్పి మాజీ ఫ్లోర్‌లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహ్మారెడ్డి లు పేర్కొన్నారు. డిమాండ్‌ల సాధనకోసం అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 9 వరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ సంఘీబావం తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బుట్టి బాలరాజ్ అద్వర్యంలో కందుకూరు, మహేశ్వరం, శంషాబాద్, మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై ఆర్టీఓ కార్యాలయం ఎదుట దర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ....పాలకులకు ప్రజల బాదలు పట్టించుకునే సమయం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్‌ల సాధన కోసం 9 రోజులుగా నిరసన దీక్షలు చేస్తుంటే పాలకులు మొద్దు నిద్రపోతున్నారని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల భవిష్యతు ఎమవుతుందో పట్టదా అని ప్రశ్నించారు. పాలకులకు పోయేకాలం దగ్గర వచ్చిందని ఈ విషయాలను ప్రజలు గమనించాలని వచ్చే ఎన్నికలలోపాలకులకు బుద్ధి చేప్పాలని సూచించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని ఈ విషయంలో అంగన్‌వాడీలకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నేటి పాలకులు చేయకపోతే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అంగన్‌వాడీల డిమాండ్‌లను పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంపిపి రఘుమారెడ్డి, కందుకూరు వైస్ ఎంపిపి శమంత ప్రభాకర్‌రెడ్డి, క్రిష్ణా నాయక్, సిపిఎం జిల్లా నాయకులు డి రాంచందర్, అందుగుల సత్యనారాయణ, ఎస్ మల్లేష్, శ్రీకాంత్‌రెడ్డి, క్రిష్ణానాయక్, బి శ్రీనివాస్, శేకర్, సత్యం, బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూర్ మండలంలో...**
**కొత్తూర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించని ప్రభుత్వాల సరైన బుద్ది చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్ అన్నారు. కొత్తూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న దీక్షకు మద్దతుగా కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి మంగళవారం దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... అంగన్‌వాడీ కార్యకర్తలకు సరైన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోతే ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధం కావాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మద్దతు తెలిపిన వారిలో సీపీఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీసా సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వీరమోని నరసింహ, ఇమ్రాన్, అభినాష్, నాని, మనోహార్, నరేష్ తదితరులు ఉన్నారు.

**కడ్తాల్ మండలంలో...**
**కడ్తాల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** కడ్తాల్ మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లు, సిబ్బంది సమ్మె చేస్తున్న శిబిరాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ సందర్శించారు. అంగన్‌వాడి టీచర్లు సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాటాడుతూ మీ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, ఎంపిటిసి సభ్యులు లచ్చిరామ్ నాయక్, గంప శ్రీను పాల్గొన్నారు.

**ఆమనగల్లు మండలంలో...**
**ఆమనగల్లు, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారం రోజుల నుండి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆమనగల్లు పట్టణంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మెను మంగళవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించి సంఘీభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. విద్యాబుద్దులు నేర్పవలసిన టీచర్లు సమస్యల సాధన కోసం రోడ్డు మీదకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీల డిమాండ్‌లను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అలివేలు, రాజ్యలక్ష్మి, సంధ్య, లక్ష్మమ్మ, శాంతమ్మ, అలివేలు, రజిత, నాగశిరోపాణి, స్వరూప, సువర్ణ, అంజమ్మ తదితరులు ఉన్నారు.

## శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిపిఓ

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త**
శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం ముందస్తుగా జరుగుతున్న ఏర్పాట్లను మేడ్చల్ జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) రమణ మూర్తి సందర్శించి పరిశీలించారు. మంగళవారం ఆయన శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను సందర్శించి పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగ వివిద శాఖల అధికారులు ఏర్పాట్లు సిద్దం చేస్తున్నారు. చెరువు ప్రాంగణంలో క్రేన్‌లను, బారికేట్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సారి శామీర్‌పేట పెద్ద చెరువు నిండటంతో చెరువు నీరు నిండుకుండలా ఉండటంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండ ముందస్తు చర్యలు చేపట్టటం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్యశాఖల, మండల పరిషత్, గ్రామపంచాయతీల సంబంధిత అధికారులు ఏర్పాట్లు పకడ్బంధీగ చేయాల్సి న చెప్పవచ్చు. ఈ శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించిన వారిలో డిపిఓతో పాటు శామీర్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి మౌనిక, అలియాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం ముందస్తుగ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన డిపిఓ రమణమూర్తి, పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు మౌనిక, శ్రీనివాస్, సిబ్బంది

## ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించాలి



ఘట్‌కేసర్‌లో నిరాహారదీక్ష చేపట్టిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్య ంలో ఘట్‌కేసర్ మండల కార్యాలయం ముందు నిహారదీక్ష చేపట్టారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేశ్ మాదిగ ముఖ్యఅతిధిగా విచ్చేసి దీక్ష చేస్తు న్న వారికి సంఘీభావం తెలిపారు. మండల కన్వీనర్ గద్దల రవి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన వహించారు. రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ కాంగ్రెస్ తీర్మాణం చేసిందని బిజెపి చేయకుండా మాదిగజాతిని మోసం చేస్తుందన్నారు. పార్లమెంట్‌లో మెజారిటీ ఉన్న బిజెపి ప్రభుత్వం వర్గీకరణ చేసి బిల్లుని ఆమోదించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉపేందర్, నర్సయ్య, దాసు, ప్రసాద్, మహేశ్, నరేందర్, శ్రీనివాస్, అంజనేయులు, మహేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక ఉత్సవాలు ప్రారంభం

**-వాడవాడల్లో వినాయకుల విగ్రహాలు ఏర్పాటు**



శామీర్‌పేటలో వినాయకుని విగ్రహం వద్ద జరిగిన పూజలు పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకుల, భక్తుల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త**
శామీర్‌పేట ఉమ్మడి మండలంలో వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. సోమవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, అదే విధంగ తూంకుంట మున్సిపాల్టీలోని వివిధ గ్రామాలు, వార్డులలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు ఘనంగ నిర్వహిస్తున్నారు. వాడవాడల్లో, గల్లీల్లోనూ వినాయకుల విగ్రహాలు ధర్శనం ఇస్తున్నాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి వినాయకుల విగ్రహాలను మండపాల వద్ద ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. మంగళవారం రెండవ రోజు కూడ గ్రామాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శామీర్‌పేటలోని జరిగిన వినాయకుని పూజా కార్యక్రమంలో శామీర్‌పేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్, గ్రామ ఎంపిటిసి సభ్యుడు డి.సాయిబాబు, కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అఫ్జల్‌ఖాన్, పలువురు నాయకులు, వార్డుసభ్యులు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోనూ వినాయకుల ఉత్సవాలు ఘనంగ భక్తి పారవశ్యంతో నిర్వహిస్తున్నారు. వినాయకుల మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు వినాయకుల విగ్రహాలను సందర్శించి పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొంటున్నారు.

**ఘట్‌కేసర్ మున్సిపల్‌లో....**
**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్‌లో సోమవారం వినాయకచవితి పండుగను భక్తి, శ్రద్దలతో నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్, బాలాజీ నగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, శివారెడ్డిగూడ, కొండాపూర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ తదితర చోట్ల యువజన, కాలనీ సంఘాలు వినాయక మండపాలను ఏర్పాటు చేసి గణనాధుడిని ప్రతిష్టి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆయా వార్డులో శ్రీవిఘ్నేశ్వరస్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా నిర్వహకులు సన్మానాలు చేశారు. వైఎస్ చైర్మన్ మాధవరెడ్డి అంబేద్కర్ యువజన సంఘం, డైమండ్‌యూత్, సర్దార్ వల్లబాయిపటేల్, యూనివర్సల్‌యూత్, ద్వారకా యూత్, యంగ్‌మ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాధులకు పూజలు జరిపారు. మండలంలోని చౌదరిగూడ, ఎదులాబాద్, ఘణాపూర్, మర్రిపల్లిగూడ, వెంకటాపూర్, వెంకటాద్రిటౌన్‌షిప్, స్వర్ణగిరి కాలనీ తదితర గ్రామాల్లో వినాయక చవితి పండును ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్‌లో వినాయక విగ్రహాలు, పూలు, పండ్ల ధరలకు అధికంగా పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. వినాయక ప్రతిమలు, పూజాసామాగ్రి, డెకరేషన్ పరికరాల విక్రయాలతతో పట్టణంలో రహదారిపై విపరీతమైన రద్దీ ఏర్పడింది.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

**నందిగామ సెప్టెంబర్19, ప్రభాతవార్త :**
నందిగామ మండల కేంద్రంలో ఉన్న నూజీవీడు సీడ్స్ పరిశ్రమ వెనక భాగంలో రైల్వేట్రాక్‌పైన సుమారు 35 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని శరీరంపై గ్రే కలర్ చలికొటు, నీలికలర్ లోయర్ ధరించి ఉన్నాడు. రైతులు ప్రమాదంలో తలభాగం, శరీర బాగాలు విరిగి మోఖం గుర్తు పట్టలేని విధంగా తయారైంది. ఈ సంఘటన విషయమై రైల్వే సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

## డీసీఎం, బైక్ ఢీకొని యువకుడి మృతి

**కొడంగల్, సెప్టెంబర్ 19ప్రభాతవార్త**
డీసీఎం, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం ఉదయం కొడంగల్ పట్టణంలోని బండల ఎల్లమ్మ దేవాలయ సమీపంలో గల హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సంఘటనకు సంభందించి పోలీసుల కథనం మేరకు..బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన ఎం.రాజు(33) ద్విచక్ర వాహనంపై వెళు తుండగా అదే సమయంలో డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టిం ది. సంఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘట నపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మేడ్చల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త ః**
రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మేడ్చల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ సమీపంలోని గోదాములో పని చేస్తున్న రవీందర్ (23), అభిషేక్ (19)లు మంగళవారం మధ్యాహ్నం నగర శివారులోని దూళపల్లిలోని మరో గోదాము వద్దకు బైక్ మీద వెళుతున్నారు. ఈ క్రమంలో గుండ్లపోచంపల్లి సమీపంలోని అయోధ్య చౌరస్తా వద్ద వీరి బైక్‌ను టిప్పర్ లారీ ఢీ కొట్టింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

**చేర్యాలలో పోషణ అభియాన్, పోషణమాసం వేడుకలు**
**చేర్యాల, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోషణ అభియాన్, పోషణమాసం వేడుక లను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, సీడీపిఓ శారధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ వారు పాల్గొని బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేజీబీవిహెడ్ మాస్టర్ కృష్ణవేణి, ఐసిడిఎస్ నాగరాణి, రేణుక, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ ఏఎన్ఎం విజయ పాల్గొన్నారు.

**బిజెఆర్ చౌరస్తాలో అంగన్‌వాడీల రాస్తారోకో**
**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్క రించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బిజెఆర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ఆయాల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించిన ఫలితం శూన్యమన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం టీచర్ అనే తోక తలిగించి వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతం ఇవ్వాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అంగన్‌వాటీ టీచర్లకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు చెల్లించాల న్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, నాయకులు కళావతి, లక్ష్మీ, శారద, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

**రక్షణ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం**
శామీర్‌పేట సెప్టెంబర్19, ప్రభాతవార్త : హైదరాబాద్‌కు చెందిన స్కంద ఏరోస్పేస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఏటిపిఎల్) తన అత్యాధునికి గేర్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఏరో స్పేస్-స్టాండర్డ్ గేర్లను రూపొందించడానికి దేశంలో మొట్టమొ దటిసారిగా ఈ తయారీకేంద్రం ఏర్పాటైంది. ఇది ఏరోస్పేస్ ఉత్ప త్తులను పెంచడంలో ఒక ఆశాజనకమైన దశను సూచిస్తుంది. ఈ అధునాతన కేంద్రం ప్రారంభోత్సవానికి సీనియర్ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పి.ఎ హాజరైయారు. ఈ సందర్భంగా రఘువంశీ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ మాట్లాడుతూ...స్కంద ప్రారంభో త్సవం దేశ ఏరోస్పేస్, రక్షణ రంగ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి ముందుకు తీసుకెళ్లడంలో స్థిరమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కండ్లకోయలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

**మేడ్చల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త ః**
గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి పరిధిలోని కండ్లకోయ గ్రామానికి చెందిన మైసనోళ్ల సత్యమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఆమెకు మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందింది. పథకం ద్వారా మంజూరైన రూ.55 వేల చెక్కును మంగళవారం గ్రామంలో బిఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ నరేందర్‌రెడ్డి సత్యమ్మకు పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, కర్రొళ్ల స్వామి, బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు రాజేందర్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్, శివ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతిమ యాత్ర గౌరవప్రదంగా జరగాలి



వైకుంఠ ధామం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

**వికారాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
అంతిమయాత్ర గౌరవప్రదంగా జరగాలని, ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం వైకుంఠ ధామాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని వికారాబాద్ ఎమ్మెల్య డాక్టర్ మెతుకు ఆనంద్, మునిసిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. రూ.1.10 కోట్ల మున్సిపల్ నిధులతో నిర్మించిన గంగారం వైకుంఠధామాన్ని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మరణించిన వ్యక్తి అంతిమయాత్ర గౌరవప్రదంగా ఉండాలనే మంచి ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలలో వైకుంఠధామాలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరిగిందని తెలిపారు. గతంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వికారాబాద్‌లో స్థిర పడిన కుటుంబంలో ఒక మనిషి చనిపోతే 7 గజాల జాగ లభించేది కాదని, ప్రస్తుతం అలాంటి సమస్య తలెత్తకుండా గంగారంలో వైకుంఠ ధామం అన్ని సౌకర్యాలతో నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు సురేష్, చందర్ నాయక్, రామస్వామి, కో ఆప్షన్ సభ్యులు రాజమల్లు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్‌పై టిడిపి నేతల దీక్ష భగ్నం



ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మంగళవారం టిడిపి నాయకులు తలపెట్టిన నిరసనదీక్షను పోలీసులు భగ్నం చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై ఘట్‌కేసర్ మండల కేంద్రంలో నిరసనదీక్ష చేస్తామని టీడీపీ నాయకులు ప్రయత్నించగా ఘట్‌కేసర్ ఎస్ఐ అశోక్ సిబ్బందితో వెళ్లి ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిడిపి మండలశాఖ అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, ఉపాధ్యక్షులు సామల జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ నాయకులు పాటి సురేందర్, టి.మహేశ్‌లను పీఎస్‌లో ఉంచి తర్వాత విడుదల చేశారు. చంద్రబాబుపై అక్రమంగా స్కిల్‌డవలప్‌మెంట్ కేసు పెట్టి జైలుకు పంపడం తగదని దీనిని నిరసన దీక్ష చేయడానికి తాము ప్రయత్నిస్తే పోలీసులు అరెస్ట్ చేయడం సమంజసంగా లేదంటూ నినాదాలు చేస్తూ పీఎస్‌లో నిరసన తెలిపారు.

## గణనాథుడికి ఘనంగా పూజలు



గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

**బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట హనుమాన్ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. వినాయక ప్రతిమను అందజేసిన మండల బీసీ సెల్ అధ్యక్షులు రవి గౌడ్, అశోక్‌గౌడ్‌లు మంగళవారం గణనాథుడికి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పూజారి ప్రశాంత్, మండప నిర్వాహకులు భరత్, పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ

**ధారూర్ సెప్టెంబర్19,ప్రభాతవార్త :**
వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అన్ని మతాల ప్రజలు సహకరించాలని ధారూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ ,ఎస్ఐ సంతోష్ కుమార్ కోరారు.మంగళవారం ధారూర్ పోలీస్ స్టేషన్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గణేష్ మండపాల ఏర్పాటు ఉత్సవాల నిర్వహణకు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ప్రజలకు సూచించారు.వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి పోలీసు స్టేషన్‌లలో అందజేయాలని తెలిపారు.వినాయక చవితి ఉత్సవాలలో నిబంధనలు పాటించాలని కోరారు.నిమజ్జనం ఊరేగింపులో డిజేలకు అనుమతులు లేదని అందుకు ప్రజలు సహకరించాలని అన్నారు.అపరిచిత వ్యక్తులు మండపాల వద్ద కనిపిసేనత వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే 8712670033 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.ఈ సమావేశంలో ధారూర్ సర్పంచ్ చంద్రమౌళి,యాత్రగౌడ్,అంజయ్య,కావలి అంజయ్య, బాబా ఖాన్,యాకూబ్,లక్ష్మయ్య,హాఫీజ్,ఖుదత్ర్ అలి,వివిధ గ్రామ ప్రజలు ,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి : డిఎల్‌పిఓ అనిత



ధారూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ అనిత

**ధారూర్ సెప్టెంబర్19,ప్రభాతవార్త :**
గ్రామాలలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డిఎల్‌పిఓ అనిత ఆదేశించారు.మండలంలోని మున్నూరు సోమవారం ,ధారూర్ గ్రామాలను ఆమె మంగళవారం సందర్శించారు.గ్రామాలలో వైకుంఠదామం,సెగ్రిగేషన్ షెడ్డు,పల్లె ప్రకృతి వనం,నర్సరీని పరిశీలించారు.డంపింగ్ యార్డుల్లో తడి ,పొడి చెత్తలను వేరు చేసి కంపోస్ట్ ఎరువును తయారు చేయాలన్నారు.మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు .ధారూర్‌లోని సెగ్రిగేషన్ షెడ్డు,పల్లె ప్రకృతి వనం,వైకుంఠదామం పరిశుభ్రత లేకపోవడంపై పంచాయతీ కార్యదర్శి అంజ్యా నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.ఆమెతో పాటు మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లాఖాన్,పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : సిఐటియు



**తాండూరు టౌన్ సెప్టెంబర్19,ప్రభాతవార్త :**
అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం తాండూరు పట్టణంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు.మండల కార్యాలయం నుండి మంత్రి మహేందర్ రెడ్డి ఇంటి వరకు ర్యాలీ ,ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వారికి కనీస వేతనం అందజేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాండూరు ప్రాజెక్టు అధ్యక్షుడు బేబి కార్యదర్శి సుధారాణి,ఉపాధ్యక్షులు జయంతి రాజేశ్వరి సుజాత,శశికళ శోభ రాధా మనిమాల సరస్వతి రమాదేవి లలితా భాగ్యలక్ష్మి,అంజమ్మ ,సహకార్యదర్శులు హారతి చంద్రకళ,మారుతమ్మ,సంధ్య రాణి సవిత పద్మ,వసంత వాణి, అంజమ్మ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ నర్సమ్మ,సంధ్యా భారతి,విజయలక్ష్మి,శ్యామల శాంతి,పాల్గొన్నారు

## బిఆర్ఎస్ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేద్దాం

### -వర్కింగ్ ప్రెసిడెంట్ డివై నర్సిములు

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషిచెద్దామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డివై నర్సిములు పిలుపునిచ్చారు. ఇటీవల నూతన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డివై నర్సిములును మంగళవారం మండల బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివై నర్సిములు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బిఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని, అందుకు కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసెకెళ్ళే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. బిఆర్ఎస్ నుంచి అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చిన వారిని గెలిపించే భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు. డివై నర్సిములును సన్మానించిన వారిలో డిఎల్‌డిఏ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటి మాజీ వైస్‌చైర్మెన్ జితేందర్‌రెడ్డి, రెగొండి, కొండాపూర్,కందనెల్లి సర్పంచ్‌లు హైదర్, చంద్రప్ప, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాంచంద్రయ్య, ఇందూరు ప్రకాష్, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నారాయన్‌గౌడ్, సంజీవరెడ్డి, రాధక్రిష్ణరెడ్డి,తట్టెపల్లి పీఏసిఎస్ వైస్ చైర్మెన్ అంజయ్య తదితరులు ఉన్నారు.



డివై నర్సిములుకు సన్మానం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# కర్నాటక తరహాలో తెలంగాణాలో 6 గ్యారెంటీ స్కీంలు అమలు

### -తెలంగాణాలో కుటుంబ పాలనను తరిమికొట్టాలి
### -మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షులు నానా పటేల్



విలేకరులతో మాట్లాడుతున్న మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షులు నానా పటేల్

**కొడంగల్,సెప్టెంబర్ 19ప్రభాతవార్త**
రానున్న ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నాటక తరహాలో తెలంగాణా రాష్ట్రంలోను 6 గ్యారెంటీ స్కీంలు అమలు చేయడం జరుగుతుందని మహారాష్ట్ర పీసీసీ అద్యక్షులు ఎమ్మెల్యే నానా పటేల్,డీసీసీ అద్యక్షులు,మాజీ ఎమ్మెల్యే టీ.రాంమోహన్‌రెడ్డిలు స్పష్టం చేశారు.సోమవారం కొడంగల్ పట్టణంలోని టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడారు.తుక్కుగూడలో విజయభేరి బహిరంగ సభలో సోనియాగాంధీ,రాహుల్‌గాంధీ,ఏఐసీసీ అద్యక్షులు మల్లిఖార్జున ఖర్గేలు ప్రకటించిన 6 గ్యారెంటీ స్కీంలను తెలంగాణా పక్కాగా అమలు చేయడం జరుగుతుందన్నారు.తెలంగాణా ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ మాట తప్పకుండా 6 గ్యారెంటీ స్కీంలను అమలు చేస్తామన్నారు.ఇందులో అభయహస్తం, మహాలక్ష్మీ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2500,పింఛన్‌లు రూ. 4000,రూ.500లకే గ్యాస్ సిలిండర్‌లు,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం,రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ.15వేలు,కౌలు రైతులకు రైతుబంధు,గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకకు ఉచిత విద్యుత్, విద్యార్దినిలకు ఎలక్ట్రికల్ స్కూటీల పంపిణీ,యువ వికాసం,అంతర్జాతీయస్దాయిలో ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు,విద్యా భరోసా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు.కేంద్రంలో నరేంద్రమోదీ,రాష్ట్రంలో కేసీఆర్ ఇద్దరు తోడు దొంగలని ఆరోపించారు.తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ నేడు అప్పులకుప్పగా మార్చాడని ఎద్దేవా చేశారు.తెలంగాణా ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రేస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణా ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే ప్రతిఫలం బీఆర్ఎస్ పొందుతున్నదన్నారు.టీఆర్ఎస్ 10 ఏళ్ళ కుటుంబ పాలనలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడింది తప్ప ప్రజల బతుకులు బాగుపడలేదని విమర్శించారు.తెలంగాణా సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెడుతు కల్వకుంట్ల కుటుంబం ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని ద్వజమెత్తారు.24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్న కేసీఆర్ అబద్దపు మాటలతో పబ్బం గడుపుతున్నారని అన్నారు.ఉచిత విద్యుత్ కాంగ్రేస్ పాలనలో దివంగత వైఎస్ఆర్ అమలు చేశారని గుర్తు చేశారు.మరోపక్క ధరణీ పోర్టల్ పేరుతో రైతులను దగా చేస్తున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై కాంగ్రేస్ పార్టీ చార్జ్‌షీట్‌తో ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మహారాష్ట్ర స్కోక్స్ పర్సన్ అతుల్ లొండె పాటిల్,పీసీసీ ప్రతినిధులు ఎండీ.యుసుఫ్,వార్ల విజయకుమార్,కోస్గీ అన్న కిష్టప్ప,బ్లాక్ కాంగ్రేస్ అద్యక్షులు జయక్రిష్ణ,మండల పార్టీ అద్యక్షులు నందారం ప్రశాంత్, నర్సిములు గౌడ్,సంజీవ్‌రెడ్డి,కొడంగల్ నయ్యూం,దాము, ఎండీ.ముస్తాక్, సంజీవ్‌రెడ్డి, తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలి : కలెక్టర్ నారాయణరెడ్డి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**వికారాబాద్,సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన జరగాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫామ్ 6,7,8 ల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ఆర్డీవో లు, తహసీల్దారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని కళాశాలల్లో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అందరిని వందకు వంద శాతం ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈరోజు నుండి ఆన్ లైన్ ద్వారా మాత్రమే నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఓటరు జాబితా నుండి చనిపోయిన, డూప్లికేట్ ఓటర్లను తొలగించాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు అన్నింటిని ఈనెల 25 వరకు పరిష్కరించాలని, జిల్లాకు కొత్తగా మంజూరైన వైద్య కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులను గుర్తించి ఆన్ లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో 90 సంవత్సరాలు ఆపైన వయసు గల వారిని క్షేత్రస్థాయిలో ఒకసారి పరిశీలించుకోని పక్కాగా ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, స్వీప్ నోడల్ అధికారి కోటాజి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాలయ శిఖర కలశం ఊరేగింపు



శిఖర కలశంను ఊరెగిస్తున్న భక్తులు

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలం మంబాపూర్ శివాలయ శిఖర కలశంను అంగరంగ వైభవంగా ఊరెగించారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్‌లో వేద మంత్రాలతో, భక్తుల కోలహలంతో వీధులాగుండా శికర కలశంను ఊరెగింపుగా తీసుకెళ్ళారు. భక్తి, భజన పారవశ్యంతో శివనామ స్మరనతో కలశంను ఘనంగా ఊరెగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.శ్రావన్, ఉపసర్పంచ్ పద్మమ్మ, గ్రామపెద్దలు టి.విజయ్, తాండ్ర అనిల్‌కుమార్, బాలు, రాజు, శ్రీనివాస్, నర్సిములు, ద్యావరి శివారెడ్డి, చిన్నారెడ్డి,మారుతి,చింటు,వెంకటయ్య, పాల్గొన్నారు.

# వ్యక్తి ఆత్మహత్యాయత్నం..కాపాడిన పోలీసులు

### -ఆర్థిక సమస్యలతో రైలుకింద పడే ప్రయత్నం



ఘట్‌కేసర్‌లో రైలుపట్టాల నుంచి బాధితున్ని రక్షిస్తున్న పోలీసులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:**
ఓచికెన్ వ్యాపారి ఆర్థిక సమస్యలతో రైలుకింద పడి ఆత్మహత్యా యత్నం చేయగా ఘట్‌కేసర్ పోలీసులు కాపాడారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మధ్యాహ్నం 3 గంటల సమయంలో శంషాబాద్ నుంచి సరళమ్మ అనే మహిళ 100 డయల్ ద్వారా పోన్ చేసి తన భర్త వెల్దండ చిన్నయ్య ఘట్‌కేసర్‌లో రైల్వేట్రాక్‌పై పడి చనిపోతున్నానని తనకు పోన్ చేసి తెలియజేశాడని చెప్పడంతో ఘట్‌కేసర్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. 100 డయల్ ద్వారా వచ్చిన సమాచారంతో చిన్నయ్య పోన్‌నంబర్ సేకరించిన ఘట్‌కేసర్ ఎస్ఐ అశోక్ అతని పోన్ లోకేషన్ కోసం మల్కాజ్‌గిరి డీసీపీ ఆఫీసు నుంచి అనుమతి తీసుకొని పోన్‌లైవ్ లోకేషన్ గుర్తించారు. దీంతో ఎస్ఐ, పెట్రోమొబైల్ సిబ్బంది పోన్ లోకేషన్‌కు చేరుకోగా చిన్నయ్య (40) ఘట్‌కేసర్ నారాయణగార్డెన్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్ పైన పడుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నాంచాడు. పోలీసులు గమనించి వెంటనే అతన్ని పట్టాల నుంచి పక్కకు తీసుకువచ్చి నీరు తాగించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నయ్య గత 10 సంవత్సరాల నుంచి బోడుప్పల్ గాయత్రీనగర్‌లో చికెన్ దుకాణం నడుపుతుండగా గత 2 ఏళ్లుగా కుటుంబ, ఆర్థిక సమస్యలు అధికమై మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. తనకు కుమారుడు రాకేశ్ (17), కూతురు వైష్ణవి (14) ఉన్నారని చెప్పగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చిన్నయ్య భార్య సరళమ్మ ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు రాగా పోలీసులు అప్పగించారు. ఈమేరకు పోన్‌కాల్‌తో వెంటనే స్పందించిన ఎస్ఐ అశోక్, పెట్రోమొబైల్ సిబ్బంది సురేశ్, ఎస్‌పీఓ రాజన్న, హోంగార్డు నాగరాజులను సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

## నకిలీ పచ్చజొన్న విత్తనాలతో నష్టపోయామని రైతుల ఆందోళన

### -మొక్కలు ఏపుగా పెరిగినా..కంకి రాలేదని వ్యవసాయ అధికారికి వినతి



వ్యవసాయ శాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

**కొడంగల్ రూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:**
నకిలీ పచ్చజొన్న విత్తనాలతో నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన రైతులు రాములు, పకీరప్ప, కిష్టప్ప, శాంతమ్మ తదితరులు రైతుల పరస్పర సహాయక సహకార పరపతి సంఘం రైతు సేవ కేంద్రం గోకఫస్లాబాద్‌లోని సీడ్స్ దుకాణంలో పచ్చ జొన్న విత్తనాలు కొనుగోలు చేసి పంట పొలాల్లో విత్తారు. జొన్న మొక్కలు ఏపుగా పెరిగినా కంకులు రాకపోవడంతో రైతులు సీడ్స్ దుకాణ యజమాని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో మంగళవారం కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్‌కు వినతి పత్రం అందించారు. తాము తీవ్రంగా నష్టపోయామని సీడ్స్ యజమాని నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని మొర పెట్టుకున్నారు.

## పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం ఖాయం

### - కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు



కాంగ్రెస్ పార్టీలో చేరిన ముజాహిద్‌పూర్ గ్రామ నాయకులు

**కుల్కచర్ల సెప్టెంబర్19,ప్రభాతవార్త :**
పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ(టి.రాంమోహన్‌రెడ్డి) విజయం ఖాయం అని కుల్కచర్లల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిఎస్ ఆంజనేయులు అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు డిసిసి అధ్యక్షుడు టి.రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన సోనియాగాంది సభకువచ్చిన ప్రజలను చేసి టిఆర్ఎస్ బిజెపిలో గుబులు మొదలైందని అన్నారు.ఏది ఏమైనా త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.రామ్‌మోహన్‌రెడ్డి విజయం లాంచనమేనని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరినవాళ్లలో కాకి వెంకటయ్య,తీగల బాల్‌రాజ్,మేకల వెంకటేష్,మేకల మల్లేష్,మేకల శివ,ముసలి గోపాల్,ముసలి మల్లేష్,సందని సాయికుమార్,ముసలి రవి,తీగల శేఖర్,ఉన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యుడు ముసలి వెంకటేష్,టిఆర్ఆర్ సోషల్ మీడియా కన్వీనర్ పడిగెల్ల భీం భాస్కర్ తదితరులు ఉన్నారు.

## పేదలకు అండగా టిడిపి

**కుల్కచర్ల సెప్టెంబర్19,ప్రభాతవార్త :** నిరుపేదలకు తెలుగుదేశం పార్టి ఎప్పుడూ అండగా ఉంటుందని టిడిపి జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్‌బాబు.మండల పార్టి అధ్యక్షుడు సిహెచ్ బాలముకుందం అన్నారు.మంగళవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో పేదరైతు శివని వెంకప్ప హఠాన్మరణం చెందడంతో వారు మృతుడి కుటుంబాన్ని ఓదార్చి అంత్యక్రియల నిమిత్తం 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో రామన్న మాదిగ,బాలకృష్ణ,ఎస్.వెంకటయ్య, ఎస్.బాబు, డి.దస్తయ్య,కె.నర్సిములు, కె.రాములు,ఎస్.భీమయ్య కాసాని యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

### -మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా



మేడ్చల్‌లో ధర్నా నిర్వయిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**మేడ్చల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :**
ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేని ఎడల మాదిగలు వచ్చేకల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగినబుద్ది చెబుతారని జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్ వై అశోక్, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు పరుశురాం అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై దర్నా నిర్వయించారు. ఈ సందర్భంగా స్థానిక బస్ డిపో నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏండ్లుగా ఉద్యమ పోరాటాలు చేస్తున్నా బిల్లుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. బిల్లును ప్రస్తుత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విదంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాదిగలు తగిన బుద్ది చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ రాంచందర్, నాయకులు బాలకృష్ణ, ప్రభాకర్, నవీన్, శివకుమార్, రామకృష్ణ, మహేష్, భానుచందర్, సునీల్, రమేష్ బాబు, బాల నర్సింహ, స్వామి, పద్మారావు, నర్సింహ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

### -జడ్‌పిటిసి ధారాసింగ్



నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటి అధ్యక్ష,కార్యదర్శులు

**పెద్దేముల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:**
రానున్న ఎన్నికలలో తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని జడ్‌పిటిసి ధారాసింగ్ అన్నారు. మంగళవారం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్,బ్లాక్ 1 అధ్యక్షులు లొంక నర్సిములు అధ్వర్యంలో పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల గ్రామ కమీటిలను ఎంపిక చేశారు. గొట్లపల్లి గ్రామ కమిటి అధ్యక్షుడిగా బంటు చంద్రప్ప, ప్రధానకార్యదర్శిగా బసంత్‌పటేల్, గిర్మాపూర్ అధ్యక్షులుగా మైసప్ప, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పటేల్, జైరాంతాండా అధ్యక్షులుగా దినేష్ రాథోడ్, ప్రధానకార్యదర్శిగా బద్రు నాయక్, దారునివాగుతాండా అధ్యక్షులుగా మెఘావత్ రవి,ప్రధానకార్యదర్శి జాదవ్ నరేష్, హన్మాపూర్ అధ్యక్షులుగా లొంక వెంకటేష్, ప్రధానకార్యదర్శిగా మ్యాతరి రాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ హామీల అమలులో బిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని, రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్‌కే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిసి సెల్ అధ్యక్షులు వెంకటయ్య,ఎస్‌టి సెల్ అధ్యక్షులు నారాయణ, కోఆప్షన్ మెంబర్ నసీర్, మైనార్టీ సెల్ కన్వీనర్ యండి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



గణనాథుని పూజలో పాల్గొన్న గణేష్ ఉత్సవ కమిటీ యువకులు



వినాయకుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ దంపతులు



అంతారం గ్రామంలో గణపతి పూజ నిర్వహిస్తున్న భక్తులు

# వాడవాడల కొలువుదీరిన గణనాథులు

**చౌడపూర్ మండలంలో..**

**చౌడపూర్ సెప్టెంబర్19,ప్రభాతవార్త :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ,వాడవాడలా గణేష్ మండపాలు ఆకట్టుకుంటున్నాయి. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ మండపం ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు.అత్యంత వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట,పూజ కార్యక్రమాలు నిర్వహించారు.గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గందే రాజేష్,వినయ్ ,శ్రీకాంత్,నరేష్,సంపత్ హరీష్, భరత్,నవీన్,అజయ్ మణికంఠ,అభిలాష్,రవి కుమార్,బ్రహ్మచారి,పెద్ద ఎత్తున యువకులు,భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కొడంగల్ మండలంలో...**

**కొడంగల్,సెప్టెంబర్ 19ప్రభాతవార్త :** వినాయక చౌవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కొడంగల్ పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణనాధులను ప్రతిష్టించారు.వినాయక్ చౌవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కొడంగల్ పట్టణంలోని వినాయక చౌరస్తా,అంబేద్కర్ చౌరస్తా,వడ్డర్‌గల్లీ,ఆర్యనగర్,చౌడేశ్వరీ ఆలయం,తెలంగ్‌వాడీ,బ్రహ్మణవాడీ,సంతబజార్,బాలాజీనగర్,నగరేశ్వర ఆలయం,కలాల్‌వాడీ, ఇంద్రనగర్,లాహోటీ కాలనీ తదితర ప్రాంతాల్లో సుందరంగా మండపాలను ముస్తాబు చేసి గణనాధులను ప్రతిష్టించారు.అనంతరం ప్రత్యేక పూజలు చేసి గణనాధుడికి ప్రీతికరమైన ఉండ్రాళ్ళను నైవేద్యాంగా సమర్పించారు.నేటి నుంచి 10 రోజుల పాటు వినాయక్ చౌవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు.ప్రతి నిత్యం ఉదయం,సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తు ప్రతి రోజు రాత్రివేళల్లో వినాయక్ ఉతసవ కమిటీ నిర్వహకులు భజన కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

**కుల్కచర్ల మండలంలో...**

**కుల్కచర్ల సెప్టెంబర్19,ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల వ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా మండపాల్లో కొలువైన గణనాదులకు తొలిపూజలతో ప్రారంబించారు. మండపాల్లో కొలువైన గణపయ్యలకు పార్టీలకు అతీతంగా ముఖ్యనాయకులు పూజాకార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.కుల్కచర్ల మండలంలోని అంగడి బజార్ ఉత్సవ కమిటి తరుపున ఏర్పాటు చేసిన మంటపంలో ఎలుక వాహనుడైన గణపతికి కుల్కచర్ల వార్డు మెంబర్ మోత్కూరి వెంకటేష్ తొలిపూజ నిర్వహించారు.ప్యాటగడ్డ మైత్రి యువజన సంఘం ఏర్పాటు చేసిన మండపంలో స్థానిక ఎస్ఐ శ్రీశైలం దంపతులు తొలిపూజ నిర్వహించారు.మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ యువజన సంగాలు ప్రజలు ఉత్సాహంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లదరావు,డిసిసి ఉపాధ్యక్షుడు బొలుసని భీంరెడ్డి,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడి.టిడిపి మండల అధ్యక్షుడు బాలముకుందం బిజెపి మండల అధ్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్,సీనియర్ పాత్రికేయుడు గుండుమల్ల రాజు వివిద పార్టీలకు చెందిన నాయకులు మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు